క్లుప్తంగా

వినాయకుడి నిమజ్జనం



ఏటూరునాగారం : గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలోని వినాయకుడిని గురువారం ప్రత్యేక రథంలో ఊరేగిస్తూ గోదావరిలో నిమజ్జనం చేశారు. అర్చకుడు సుదర్శనస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిపాటలతో మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెర్గు సత్యం, నాయకులు మైనర్ బాబు, బచ్చు సతీష్, మంతెన శంకర్, అటిక నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో 490 విగ్రహాల..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మొత్తం 490 గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు అధికారులు తెలిపారు. బుధవారం నాడు జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వినాయక విగ్రహాలు తరలివచ్చాయి. గురువారం తెల్లవారుజాము వరకు నిమజ్జనం కొనసాగింది.

మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జమా మజీద్ ఆధ్వర్యంలో గురువారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి జమా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురువారం ఉదయం మిలాదున్ నబీ సందర్భంగా జెండాలు పట్టుకుని శాంతిర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు వలీబాబా, ఇమామ్ సాబ్, హరీష్, రెహ్మాన్, అహ్మద్ పాషా, రియాజ్, ఖాజా, అజహర్, సోహేల్, నజీర్ పాల్గొన్నారు.

ప్రజావేదిక

వెంకటాపురం (కె) : నేడు (29న) మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అడ్డూరి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. 2021 సెప్టెంబర్ నుంచి 2023 మార్చి వరకు 18 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై చర్చించనున్నట్లు వివరించారు.

'నీతి ఆయోగ్'కు అధికారులు, ప్రజాప్రతినిధులు



గంగారం : ఢిల్లీలో జరగనున్న నీతి ఆయోగ్ సమావేశానికి మండలం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లారు. ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు ఆధ్వర్యంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, సర్పంచులు నుంచ వెంకటలక్ష్మి మహేందర్, చింత సారక్క బక్కయ్య, ఇస్లావత్ బాలకృష్ణ, ఈసం కాంతరావు, ఎంపీడీఓ అపర్ణ తదితరులు వెళ్లారు.

నేడు గోదావరి హారతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా త్రివేణి సంగమ నేపథ్యంలో నేడు (శుక్రవారం) 'గోదావరి హారతి' కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామని ఈఓ మహేష్, చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సామాజిక తనిఖీ

చిట్యాల : మండల పరిషత్ కార్యాలయంలో నేడు (శుక్రవారం) మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 4వ విడతపై సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామ సభ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్సైపై చర్య తీసుకోవాలి

చిట్యాల : గణపురం మండలంలోని చెల్పూరుకు చెందిన మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన చిట్యాల ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెల్పూరుకు చెందిన దంపతులు జమ్మికుంటకు వెళ్లి వస్తుండగా చిట్యాల మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన నిలిచి ఉండగా పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై దురుసుగా మాట్లాడారని పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



ఎస్ఎస్ తాడ్వాయి : బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో నాయకులు



కన్నాయిగూడెం : బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి హరీశ్‌రావు, తదితరులు

కన్నాయిగూడెం : మండలానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సమక్షంలో బీఆర్ఎస్‌లో గురువారం చేరారు. పొదెం కృష్ణ ప్రసాద్ ఉద్యోగ విరమణ తీసకుని చేరారు. జిల్లా కేంద్రానికి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వచ్చిన మంత్రి హరీశ్‌రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బీజేపీ మండల బీజేపీ అధ్యక్షుడు కావిరి సంతోష్, గుర్రేవుల సర్పంచ్ పూజరి లలిత, శ్రీనివాస్, జగన్, జనగం చిరంజీవి, సునార్కని విజయ్, కుమ్మరి నాగేష్, బీరెల్లి సంతోష్, తదితరులున్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, కావిరి చిన్నికృష్ణ, వెంకటయ్య, సుధాకర్, సత్యనారాయణ తదితరులున్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు గట్టు జయలక్ష్మి, గట్టు వినోద్‌కుమార్, కోట స్వరూప, మాదరి విజయ, మాదరి వెంకటమ్మ, గట్టు రమాదేవి, గంగదారి రాజమ్మ, శెవుగాని వినోద, గంగదారి దేవి, వంకాల ఎల్లయ్య, తదితరులు పార్టీలో చేరగా వారికి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. అలాగే మండలంలోని కాల్వపల్లికి చెందిన 20 మంది గొత్తికోయలు పీరీల నరేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చల్లా రజనీకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అలేటి ఇంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బండారి చంద్రయ్య, నాయకులు గోపనబోయిన కొమురయ్య, సిద్దబోయిన వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు ఖాయం

● ఎమ్మెల్యే సీతక్క



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

ములుగు : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల అమలు ఖాయమని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే సీతక్క తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 50 మంది మహిళలు కాంగ్రెస్‌లో గురువారం చేరగా వారికి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సీతక్క మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని, విజయ భేరి సభలో అధిష్టానం ప్రకటించిన అన్ని హామీలనూ అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, నాయకులు జక్కుల రేవంత్, రాంబాబు, అనిల్ కృష్ణ, బద్రి, కోటి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం



ములుగు రూరల్ : మాట్లాడుతున్న భగవాన్‌రెడ్డి



ఎస్ఎస్ తాడ్వాయి : మాట్లాడుతున్న అయూబ్

ములుగు రూరల్ : కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని గోవిందరావుపేట మండల ఇన్‌చార్జ్‌లు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, రేగ కళ్యాణి కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే సీతక్క గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం చేయండి

ఎస్ఎస్ తాడ్వాయి : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను ఇంటింటికీ ప్రచారం చేయాలని మండల ఇన్‌చార్జ్ శ్యాంసుందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సూచించారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్యాంసుందర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్ మాట్లాడారు. గౌరవ మండల అధ్యక్షుడు అనంతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజాఫర్, జిల్లా సీనియర్ నాయకుడు లచ్చుపటేల్, సర్పంచులు భూక్య మౌనిక, సునీల్, రేగ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే..



మాట్లాడుతున్న మైపతి సంతోష్‌కుమార్

ఎస్ఎస్ తాడ్వాయి : మంత్రులకు వినతులు ఇవ్వాలని ప్రయత్నించగా అనుమతి ఇవ్వకుండా నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో జిల్లా నాయకుడు రేగ కిరణ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో సంతోష్‌కుమార్ మాట్లాడారు. జిల్లా పర్యటనకు మంత్రులు వస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. మంత్రి హరీష్‌రావు పర్యటన సందర్భంగా జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. సమస్యలపై మంత్రులకు వినతులు ఇవ్వాలని ప్రయత్నించగా అనుమతించలేదని చెప్పారు. కాగా మంత్రి హరీష్‌రావు పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు లచ్చు పటేల్, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చెరప రవీందర్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచికతుపై వదిలేశారు.

వృద్ధ దంపతులకు రూ.30 వేల సాయం



కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన వృద్ధ దంపతులు కుమ్మరి మల్లయ్య–దుర్గమ్మలకు ముప్పనపల్లి సహాయ నిధి గ్రూప్ అడ్మిన్ అబ్బు సతీష్ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం రూ.30 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్యకు సతీష్ డబ్బులు అందించి మాట్లాడారు. వృద్ధ దంపతుల రోగాల బారిన పడి మంచాన పడి పోషణ భారమై వైద్య ఖర్చుల కోసం సైతం ఇబ్బంది పడుతుండడంతో సాయం అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీదరి సుమన్, దాసరి నర్సింహారావు, రియాజ్, రమేష్, నారాయణ, రాజేష్, సంతోష్, శ్రీరాములు, మోహన్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



పోలీస్‌స్టేషన్‌లో నాయకులు, అంగన్‌వాడీలు

వెంకటాపురం (కె) : అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను, నాయకులను పోలీసులు గురువారం అరెస్టు చేయగా మల్లికార్జునరావు మాట్లాడారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయటం సరికాదన్నారు. జిల్లాలో మంత్రుల పర్యటన ఉన్న క్రమంలో అరెస్టు చేశారని మండిపడ్డారు. వేతనాలు పెంచుతామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ఇకనైనా అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టైన వారిలో మల్లికార్జునరావు, కట్ల రాజు కొండయ్య, క్రాంతి, కృష్ణకుమారి, మీనాకుమారి, అరుణ కుమారి తదితరులున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి సస్పెన్షన్



ఏటూరునాగారం : బీజేపీ కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు కావిరి సంతోష్‌ను పార్టీ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతోష్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినట్టు ఆరోపించారు. సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, రీసెర్చ్ పాలసీ ఇన్‌చార్జ్ భూక్య రాజునాయక్, కిసాన్ మోర్చా నాయకుడు జాడి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతోనే ఎమ్మెల్యేపై ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య, నాయకులు

కాటారం : పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని అభ్యర్థి పుట్ట మధు అధికార దాహంతోనే ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు లేకుండానే ప్రజాఆశీర్వాద యాత్ర కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పదవి లేకుంటే జీవితం లేదన్నట్టుగా మధు వ్యవహరిస్తూ ప్రజలను, శ్రేణులను కులం, మతం పేరుతో రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. మండల ప్రజలు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు ఓట్లేయరని పుట్ట మధు వ్యాఖ్యలు చేయడం అవివేకానికి నిదర్శనమన్నారు. చెల్పూర్ జెన్కో అంశంపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంగోతు సుగుణ, మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తెప్పెల దేవేందర్‌రెడ్డి, సర్పంచులు రఘురాం, అంగజాల అశోక్, నాయకులు ఓంసింగ్, కిరణ్, కొట్టె ప్రభాకర్, మంత్రి నరేశ్, జాగిరి రాజబాబు, శశి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన గుంత పూడ్చివేత



గంగారం : కాటినాగారం, మర్రిగూడెం వెళ్లే రహదారిపై కాటినాగారం మూల వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంతను కోదండరామ సేవా సమితి ఆధ్వర్యంలో కాంక్రీట్‌తో పూడ్చి వేశారు. కార్యక్రమంలో సేవ సమితి డైరెక్టర్ రాంచందర్, సభ్యులు శశికుమార్, మధుచందర్, సంజీవరావు, పవన్ కల్యాణ్, పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

మల్హర్ : లయన్స్ క్లబ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల జెడ్పీ స్కూల్‌లో గేనేవానం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. తాడిచర, పరిసర గ్రామాల నుంచి 70 మంది పరీక్ష చేయించుకున్నట్లు లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బెల్లకొండ జయపాల్‌రెడ్డి తెలిపారు. కంట్లో శుక్లాల వల్ల చూపు లేని, ఇతర సమస్యలున్న 36 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని రేకుర్తి ఐ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా 1.75 లక్షల మందికి ఉచిత శస్త్ర చికిత్స చేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వేల్పుల రమేష్, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, మల్క రాంకిషన్‌రావు, కటకం ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా మైనార్టీ జాయింట్ సెక్రటరీగా జానీ

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ జానీ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జానీని నియమిస్తూ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ అబ్దుల్ ఫాజిల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మైనార్టీ నాయకులకు జానీ కృతజ్ఞతలు తెలిపారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్సర్ పాషా

కన్నాయిగూడెం : ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అఫ్సర్ పాషా తెలిపారు. మండలంలోని ముప్పనపల్లిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆరు గ్యారెంటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అఫ్సర్ మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. కార్యకర్తలు ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పేదలను విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, నాయకులు గుడ్ల దేవేందర్, బొల్లె భాస్కర్, తాటి రాజబాబు, శ్రీరాములు, ప్రభాకర్, యాకూబ్, చిరంజీవి, రాంబాబు, నాగేష్ పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు



ఆర్ఎంపీలతో మాట్లాడుతున్న డాక్టర్ అభినవ్

కన్నాయిగూడెం : ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దని స్థానిక వైద్యుడు డాక్టర్ అభినవ్ కోరారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆర్ఎంపీలతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు తక్షణ ఉపశమనం కలిగించేలా ప్రాథమిక వైద్యం అందించి సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి పంపించాలని తెలిపారు. స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కొందరు అనుమతి లేకున్నా పరీక్షలు నిర్వహిస్తూ రోగులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయని తెలిపారు. అనుమతులు లేని ఆర్ఎంపీల ఆస్పత్రుల్లో వైద్య శాఖ తనిఖీలుంటాయని చెప్పారు. సమావేశంలో ఆర్ఎంపీలు సత్యనారాయణ, నాగరాజు, దేవేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ గర్జనను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : అక్టోబర్ 1న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్న గౌడ గర్జనను విజయవంతం చేయాలని గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు బోనగాని యాదగిరి, పులి శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ భవనంలో స్థానిక చైర్మన్ బుర్ర రమేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ నాయకులు గౌడ గర్జన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం యాదగిరి, శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లా నుంచి గౌడ కులస్తులు తరలిరావాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు బొమ్మ సమ్మయ్య, కుమారస్వామి, ప్రభాకర్, మహేందర్, రవీందర్, సమ్మయ్య, తాటి అశోక్, పాల్గొన్నారు.

గండ్ర యువసేన మండల అధ్యక్షుడిగా సుమన్

టేకుమట్ల (గోరికొత్తపల్లి) : గండ్ర యువసేన గోరికొత్తపల్లి మండల అధ్యక్షుడిగా గోరికొత్తపల్లికి చెందిన సుదబోయిన సుమన్‌ను నియోజకవర్గ అధ్యక్షుడు కరాటే శ్రీను గురువారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే గండ్ర గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్టు తెలిపారు. తనకు మండల అధ్యక్షుడుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ అధ్యక్షుడు కరాటే శ్రీనులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ అనిల్

చిట్యాల : ఇటీవల సస్పెండ్ అయిన బానోత్ శ్రీనివాస్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎంపీటీసీ దబ్బెట అనిల్, యూత్ మండల ఉపాధ్యక్షుడు అల్లకొండ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావుపై లేనిపోని వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొంరయ్య, నాయకులు పర్లపెల్లి కొంరయ్య, మటికే రవీందర్, రాజమౌళి, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే ఇళ్ల స్థలాలు

భూపాలపల్లి రూరల్ : ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవతోనే జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందాయని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన సమితి కన్వీనర్ తిక్క ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టాల పంపిణీ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మల్హర్ : అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య డిమాండ్ చేశారు. కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించని పక్షంలో ప్రజాప్రతినిధుల ఇళ్ల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

గుర్రం జాషువా జయంతి వేడుకలు

చిట్యాల : మండలం కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం (ఏవైఎస్) ఆధ్వర్యంలో గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు పుల్ల మల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లయ్య మాట్లాడారు. జాషువా స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గుర్రపు రాజేందర్, నాయకులు జన్నె యుగేందర్, గుర్రపు రాజమౌళి, ఏకు మల్లేష్, గుర్రం తిరుపతి, కట్కూరి రమేష్, గురుకుంట్ల కిరణ్ పాల్గొన్నారు.

కాటారం : జయశంకర్ సారస్వత సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా అందించిన తెలుగు సాహిత్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సారస్వత సమితి వ్యవస్థాపకుడు గడ్డం లక్ష్మయ్య, సభ్యులు బోనాల శ్రీశైలం, నల్లగొండ సురేశ్, సత్యనారాయణ, నాగేంద్రాచారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.